ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సిద్దిపేట

5

సోమవారం 18 మార్చి 2024

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమవారం సాయంత్రం: 6.32 గం.

సహర్ : మంగళవారం ఉదయం: 5.00 గం.

కొమురవెల్లిలో భక్తుల సందడి

- స్వామివారికి రూ.5.70 లక్షల విలువైన రుద్రాక్ష మాల బహుకరణ
- దర్శనానికి 4 గంటల సమయం

కొమురవెల్లి, మార్చి 17: కొమురవెల్లి ఆలయం వద్ద ఆదివారం భక్తుల సందడి నెలకొంది. తొమ్మిదో వారం సందర్భంగా సుమారు 30వేల మంది మల్లికార్జునస్వామిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. స్వామి వారి దర్శనానికి సుమారు 4 గంటల సమయం పట్టింది. భక్తులు మల్లన్నకు బోనం నివేదించి, పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. గంగరేగు చెట్టుకు ముడుపులు కట్టారు. విజయచల గుట్టపై ఉన్న ఎల్లమ్మ తల్లికి ఒడిబియ్యం పోసి, బోనాలు నివేదించి మొక్కులు తీర్చుకున్నారు.



ఆలయ గోపురం వద్ద భక్తజన సందడి



ప్రత్యేక వేషధారణలో భక్తులు



గోల్డ్‌మన్ శ్రవణ్



ఆలయ ప్రతినిధులకు రుద్రాక్ష మాలను బహూకరిస్తున్న భక్తులు

కొమురవెల్లి మల్లన్నకు సికింద్రాబాద్‌లోని బోయిన్‌పల్లికి చెందిన భీమనబోయిన ఉమారాజు అనే భక్తుడు రూ.5.70 లక్షల విలువ గల 8.42 గ్రాముల బంగారు తీగతో అల్లిన 10 అడుగుల పొడవు రుద్రాక్షమాలను, హైదరాబాద్ ఖాజాగూడకు చెందిన ధనుంజయ్‌గౌడ్ అరకిలో వెండి పళ్లెంను ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పాటకం లక్ష్మారెడ్డి, ఆలయ ఈవో బాలాజీశర్మ, ప్రధాన అర్చకుడు మహదేవుని మల్లికార్జున్ ఆధ్వర్యంలో స్వామికి బహూకరించారు.

మల్లన్నను దర్శించుకున్న గోల్డ్‌మన్

మల్లన్నను హైదరాబాద్‌కు చెందిన గోల్డ్‌మన్ శ్రవణ్ దర్శించుకున్నారు. భారీ జన సందోహంలో మెడలో 2.5కిలోల బంగారు ఆభరణాలతో మల్లన్న దర్శనానికి రావడంతో జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.



పరీక్ష రాస్తున్న పదోతరగతి విద్యార్థులు (ఫైల్)

నేటి నుంచే పది పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లాలో 80 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 13,987 మంది విద్యార్థులు
- ప్రతీ పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు

సిద్దిపేట క్రైం, మార్చి 17: నేటి నుంచే పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. జిల్లాలో పరీక్షల నిర్వహణకు సంబంధిత అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో మొత్తం 80 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 13,987 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 80 మంది చీఫ్ ఆఫీసర్లు, 80మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, ఏడుగురు రూట్ ఆఫీసర్లను నియమించారు.

గంటముందే పరీక్షా కేంద్రానికి..

పరీక్ష సమయానికి గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. ఐదు నిమిషాలు ఆలస్యం అయితే పరీక్షా కేంద్రంలోనికి అనుమతించరని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సిద్దిపేట పోలీస్ కమిషనర్ బి.అనురాధ తెలిపారు. పరీక్ష కేంద్రం నుంచి 500 మీటర్ల వరకు జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాలన్నారు.

అగ్రస్థానంలో నిలిచేందుకు కసరత్తు

పదవ తరగతి పరీక్షల్లో జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు విద్యాధికారులు, ఉపాధ్యాయులు చర్యలు తీసుకున్నారు. గతేడాది రాష్ట్రంలో రెండవ స్థానాన్ని దక్కించుకోగా, 2022లో మొదటి స్థానాన్ని దక్కించుకుంది. ఈసారి ఎలాగైనా మళ్లీ మొదటి స్థానంలో నిలిచేందుకు విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జిల్లాలో 10వ తరగతి చదువుతున్న ప్రతీ విద్యార్థి పాస్ అయ్యే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రతీ ప్రభుత్వ పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించారు. ప్రతీ రోజూ పరీక్షలు నిర్వహించి విద్యార్థులను మెరుగుపరిచారు.



బెంచీలపై హాల్‌టికెట్ నంబర్లను వేస్తున్న దృశ్యం

ఏర్పాట్లు పూర్తి చేశాం



పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నాం. విద్యార్థులు గంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.

- డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

జిల్లాలోని పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆశిస్తున్నా. ప్రతీ విద్యార్థి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి. ఉత్తమ ఫలితాలు సాధించి సిద్దిపేట జిల్లాను అగ్రస్థానంలో నిలిపాలి.

- ఎమ్మెల్యే హరీశ్‌రావు



కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం (ఫైల్)

రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తాం



రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా యాసంగిలో ధాన్యం కొనుగోలు చేస్తాం. వ్యవసాయ శాఖ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉంది. ధాన్యం దిగుబడులకు తగ్గట్టుగా జిల్లా వ్యాప్తంగా 414పైగానే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నాం.

- హరీష్, జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం

ధాన్యం కొనుగోలుకు కసరత్తు



చిరు పొట్ట దశలో ఉన్న వరి చేను

- యాసంగిలో 3.38 లక్షల ఎకరాల్లో వరి సాగు
- 3.50 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- ఊరూరా కొనుగోలు కేంద్రాలు
- నెల రోజుల్లో చేతికి రానున్న వరి పంట

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 17: ఈ యాసంగి సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోళ్ల కోసం జిల్లా యంత్రాంగం ప్రణాళికను సిద్ధం చేసింది. జిల్లా వ్యాప్తంగా ఈ సీజన్‌లో సుమారు 3.38లక్షల ఎకరాలకు పైగా వరి సాగయిందని, దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నులకు పైగానే ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. నెలరోజుల్లో పంట చేతికివచ్చే అవకాశముండడంతో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి జిల్లా అధికార యంత్రం ప్రణాళికలు రూపొందించింది. ఈ మేరకు కొనుగోలు కేంద్రాలకు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉంటుందని, ఈ ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు.

కొనుగోలు కేంద్రాలకు 3.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం

జిల్లాలో యాసంగి ప్రారంభంలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడం, ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో నీరు ఉండడంతో విస్తారంగా వరినాట్లు వేశారు. మొదట్లో మొగిపురుగు, తెగుళ్ల బెడద వరి పంటను వెంటాడింది. ప్రస్తుతం మండుతున్న ఎండలకు భూగర్భ జలాలు తగ్గడంతో పంటలు ఎండిపోయాయి. ప్రస్తుతం జిల్లాలో సాగైన 3.38 లక్షల ఎకరాల వరి పంట నుంచి సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. అయితే రైతు అవసరాలు, సీడ్ ప్రొడక్షన్ ద్వారా సాగుచేసిన వాటిని తీసేయగా.. దాదాపు 3.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అధికారులు భావిస్తున్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా వేస్తున్న దృశ్యం (ఫైల్)

414కు పైగా కొనుగోలు కేంద్రాలు

గతంలో మాదిరిగానే జిల్లాలో దాదాపు అన్ని గ్రామాల్లో 414కు పైగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికను రూపొందించారు. ఇందులో పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో 188, ఐకేపీల ఆధ్వర్యంలో 221, మెప్మా ఆధ్వర్యంలో 5 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అవసరం ఉంటే మరిన్ని కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. కాగా ప్రభుత్వం నిర్ణయించిన ఏ-గ్రేడ్ ధాన్యం క్వింటాలుకు రూ.2,203, బీ-గ్రేడ్‌కు రూ.2,183 చొప్పున కొనుగోలు చేయనున్నారు. 85లక్షలకు పైగానే గన్నీ బ్యాగులు అవసరమని నిర్ణయించారు. ప్రస్తుతం జిల్లాలో దాదాపు 65 లక్షలకు పైగానే గన్నీ బ్యాగులు అందుబాటులో ఉన్నాయి.



సిద్దిపేట పట్టణంలోని జిల్లా గ్రంథాలయంలో చదువుకుంటున్న అభ్యర్థులు

ఆశల పల్లకిలో..

- వరుస నోటిఫికేషన్లతో నిరుద్యోగుల్లో హర్షం
- ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న ఆశావాహులు
- జిల్లాలో సుమారు 2లక్షల మంది నిరుద్యోగులు
- కిటకిటలాడుతున్న స్టడీ సర్కిళ్లు, లైబ్రరీలు

సిద్దిపేట క్రైం, మార్చి 17: రాష్ట్ర ప్రభుత్వం వరుసగా ఉద్యోగాల నోటిఫికేషన్లు జారీ చేయడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే తపనతో పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. గ్రూప్-2, గ్రూప్-3, డీఎస్సీ, టెట్, హాస్టల్ వార్డెన్ నోటిఫికేషన్లు రావడంతో అర్హత కలిగిన అభ్యర్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. జిల్లాలో డిగ్రీ, పీజీ, బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన వారు సుమారు 2లక్షల మంది ఉన్నట్లు సమాచారం. వారంతా ప్రభుత్వ ఉద్యోగాల కోసం వేచి చూస్తున్నారు. జిల్లా నుంచి హైదరాబాద్‌లోని కోచింగ్ సెంటర్లకు వెళ్తున్నారు. కొందరు జిల్లాలోని స్టడీ సర్కిళ్లు, లైబ్రరీలను ఆశ్రయిస్తున్నారు.

జిల్లా కేంద్రంలో బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్లు

సిద్దిపేట జిల్లా కేంద్రంలో పలు ప్రైవేటు కోచింగ్ సెంటర్లతోపాటు ప్రభుత్వ బీసీ, ఎస్సీ స్టడీ సర్కిళ్లను ఏర్పాటు చేశారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు ఈ స్టడీ సర్కిళ్లలో కోచింగ్ తీసుకుంటున్నారు. ఇక్కడ కోచింగ్ తీసుకునే వారికి ఉచిత భోజన సౌకర్యం కూడా ఉంటుంది.



లైబ్రరీలో పుస్తకాలతో కుస్తీ పడుతున్న నిరుద్యోగులు

జిల్లా గ్రంథాలయంలో పుస్తక సంపద

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచారు. మహిళలకు, పురుషులకు ప్రత్యేకంగా రీడింగ్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఈ గ్రంథాలయంలో 28వేల పుస్తకాలు ఉండగా వీటిలో ఐదు వేలకు పైగా పుస్తకాలు పోటీ పరీక్షలకు సంబంధించినవే. ఈ గ్రంథాలయంలో కాంపిటేటివ్ ఎగ్జామ్ హాల్‌ను అందుబాటులోకి తెచ్చారు. పోటీ పరీక్షల అభ్యర్థులకు ఓరియంటేషన్ తరగతులను కూడా నిర్వహిస్తుంటారు. ఉదయం 8నుంచి రాత్రి 12 గంటల వరకు అభ్యర్థులు ఈ లైబ్రరీలో చదువుతున్నారు.

తప్పకుండా ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధిస్తా



నేను డీఈడీ పూర్తి చేసి, టెట్‌లో అర్హత సాధించాను. ప్రస్తుతం డీఎస్సీ ఎస్జీటీకి ప్రిపేర్ అవుతున్నాను. ప్రతీరోజు మా గ్రామం నుంచి సిద్దిపేటకు వెళ్లి, గ్రంథాలయంలో చదువుకుంటున్నాను. ఇక్కడ అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. రోజుకు 18 గంటలు చదువుతున్నాను. ఈసారి ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధిస్తా.

- మమత(డీఈడీ), పాలమాకుల, నంగునూరు.

రోజుకు 18 గంటలు చదువుతున్నాను



నేను బీఈడీ పూర్తి చేశాను. టెట్ క్వాలిఫై అయ్యాను. ప్రస్తుతం డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్నాను. ప్రస్తుతం రోజుకు 18 గంటలు చదువుతున్నాను. ఎలాగైనా టీచర్ ఉద్యోగాన్ని సాధిస్తాననే నమ్మకం ఉంది. మాకు సిద్దిపేట జిల్లా గ్రంథాలయంలో అన్ని పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

- శివలీల, సిద్దిపేట

7లో

నేనంటే నేను.. పల్లా వర్సెస్ కొమ్మూరి





ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-హైదరాబాద్ ప్రాంగణంలో మూడురోజుల పాటు జరిగిన 'ఎలాన్-ఎన్‌విజన్' వేడుకలు ఆదివారం అట్టహాసంగా ముగిశాయి. దేశం నలుమూలల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమం ముగింపు కూడా అంతే ఉత్సాహంగా నిర్వహించారు. మ్యూజిక్ కాంపిటేషన్స్, గేమింగ్, రోబోటిక్స్, రోబోవార్స్, యువర్‌వాయిస్, మూవీ మేకింగ్, ఫిలింఫేర్, ఎలక్ట్రిక్, ఆర్ట్ ఎగ్జిబిషన్, ఫేస్‌పెయింటింగ్, రేడియో ఇవెంట్స్ హంట్ తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నారు. విద్యార్థుల ఆటపాటలతో ప్రాంగణం మార్మోగింది.

-కంది

మున్సిపల్ తీర్మానం లేకుండానే నిధులు

● బీజేపీ కౌన్సిలర్ల ఆరోపణ



మాట్లాడుతున్న బీజేపీ కౌన్సిలర్లు

నర్సాపూర్, మార్చి 17: నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో పలు అభివృద్ధి పనులకు మంజూరైన టీఎఫ్ఐడీసీ నిధుల కేటాయింపులు ఇష్టానుసారంగా చేస్తున్నారని బీజేపీ కౌన్సిలర్లు ఆరోపించారు. ఆదివారం నర్సాపూర్‌లో బీజేపీ కౌన్సిలర్లు రాజేందర్, సురేష్, యాదగిరి, లతారమేష్‌యాదవ్ తదితరులు విలేకరులతో మాట్లాడుతూ. ఇటీవల పట్టణానికి మంజూరైన టీఎఫ్ఐడీసీ రూ.30 కోట్లను కౌన్సిల్ తీర్మానం లేకుండానే పలు పనులకు కేటాయించారన్నారు. కౌన్సిలర్లకు సమాచారం లేకుండా నిధులు కేటాయిస్తూ పలు వార్డులకు ఒక్క రూపాయి కూడా మంజూరు చేయకుండా వివక్ష చూపుతున్నారన్నారు. టీఎఫ్ఐడీసీ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



పోచమ్మ ఆలయ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ ప్రవీణ్

సంగారెడ్డి రూరల్, మార్చి 17: గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని తాళ్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఎంకని ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సంగారెడ్డి మండలం తాళ్లపల్లి గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులతో పోచమ్మ ఆలయం, ముస్లిం మైనార్టీ, కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడే గ్రామాలు అభివృద్ధి చెందాయని, గత పదేళ్లలో బీఆర్ఎస్ సర్కార్ గ్రామాల్లో అభివృద్ధిని పట్టించుకోకుండా బొందలగడ్డలుగా మార్చేసిందని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నదన్నారు. ఎస్‌డీఎఫ్ నిధుల మంజూరుకు సహకరించిన కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డికి గ్రామ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ ఉప సర్పంచ్ శ్రీశైలం, మాజీ సర్పంచ్ ఎంకని లింగం, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఎవరెస్ట్ మార్షల్ ఆర్ట్స్‌లో మనోహరాబాద్ క్రీడాకారుల ప్రతిభ

మనోహరాబాద్, మార్చి 17: ఎవరెస్ట్ మార్షల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్ డోజో కరాటే జిల్లా స్థాయి పోటీలలో మనోహరాబాద్ మండల క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచారు. ఆదివారం మెదక్ జిల్లా కేంద్రంలో ఈ పోటీలు జరిగాయి. మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన సుమారు 55 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చూపారు. గెలుపొందిన విద్యార్థులకు సన్ షైన్ షాటోకాన్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ నత్తి మల్లేష్ పతకాలు, సర్టిఫికెట్ అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఈ పథకం ద్వారా జిల్లాలోని 17 పాఠశాలల్లో కరాటే శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎవరెస్ట్ మార్షల్ ఆర్ట్స్ ఫౌండర్ గాజుల మహేష్ కుమార్, కరాటే మాస్టర్ స్వప్న పాల్గొన్నారు.



విజేతలకు సర్టిఫికెట్లను బహూకరిస్తున్న కరాటే క్లబ్ ఫౌండర్ నత్తి మల్లేష్

ఇద్దరు పిల్లలు సహా తల్లి అదృశ్యం

గుమ్మడిదల, మార్చి 17: ఇద్దరు పిల్లలతో సహా తల్లి కనిపించకుండా పోయిన ఘటన గుమ్మడిదల మండలం దోమడుగులో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్ నుంచి ఉపాధి కోసం వచ్చి గ్రామంలో నివాసం ఉంటున్న కస్తూరి రామ్‌కు ఐదుగురు కూతుళ్లు, ఇద్దరు కుమారులు సంతానం. కస్తూరిరామ్ దోమడుగులో షెడ్ వేసుకుని వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నాడు. అతని మూడో కుమార్తె సంగీత, ఆమె భర్త కాలురాంతోపాటు వారి కూతురు సుందర్(9), కొడుకు ప్రవీణ్(12) కస్తూరి రాంతోపాటే ఉంటూ ఉపాధి పొందుతున్నారు. రెండు నెలల క్రితం సంగీత దంపతుల మధ్య విభేదాల కారణంగా కాలురాం ఆమెను తండ్రి వద్దే వదిలేసి వెళ్లిపోయాడు. ఈ నెల 16న రాత్రి షెడ్‌లో అందరూ నిద్రిస్తుండగా సంగీత కొడుకు, కూతురుతో కలిసి కనిపించకుండా పోయింది. కస్తూరిరాం నిద్రలేచి చూసేసరికి ఆమె కనిపించకపోవడంతో వెతికినా ప్రయోజనం లేకపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

స్విమ్మింగ్ 'ఫుల్'

» శిక్షణ.. సేదదీరేందుకు వస్తున్న జనం

» వందల సంఖ్యలో రాక

సంగారెడ్డి అర్బన్, మార్చి 17 : ఈ వేసవిలో ఎండలు మండిపోతున్నాయి. ఎండ వేడిమి, ఉక్కపోత నుంచి కాస్తా ఉపశమనం పొందేందుకు ప్రజలు స్విమ్మింగ్‌పూల్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈత నేర్చుకునేందుకు చిన్నా, పెద్ద తేడా లేకుండా స్విమ్మింగ్ పూల్‌కు వస్తున్నారు. దీంతో స్విమ్మింగ్ పూల్‌కు తాకిడి పెరగడంతో సందడిగా మారింది.

జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని రాజీవ్ పార్కు సమీపంలో జిల్లా యువజన- క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ పూల్‌ను నెలకొల్పారు. ఇక్కడ ఉదయం 6 గంటల నుంచి 9 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 7 గంటల వరకు ఈతకు అనుమతి ఉంటుంది. సాధారణ రోజుల కంటే స్విమ్మింగ్ నేర్చుకునేందుకు ఆదివారం ఎక్కువ మంది వస్తారు. వేసవిలో రోజుకు 50-200 మంది వరకు స్విమ్మింగ్ నేర్చుకునేందుకు వస్తున్నారు. స్విమ్మింగ్ నేర్చుకునేందుకు వచ్చిన వారి కోసం ప్రత్యేకంగా కోచ్‌లను, లైఫ్ గార్డ్స్ అందుబాటులో ఉంచారు. స్విమ్మింగ్ నేర్చుకునేందుకు వచ్చిన వారు స్విమ్మింగ్ దుస్తులు వెంట తెచ్చుకోవాలి. రూ.100 నిర్ణీత రుసుము చెల్లించి గంటపాటు స్విమ్మింగ్ నేర్చుకోవచ్చు.


స్విమ్మింగ్ పూల్‌లో ఈత నేర్చుకుంటున్న యువత, చిన్నారులు

'ఈత' చక్కటి వ్యాయామం

వేసవి కాలంలో స్విమ్మింగ్ చక్కటి ఆరోగ్యాన్నిచ్చే వ్యాయామం, చల్లని నీటిలో పిల్లలు ఆనందంతో పాటు చక్కటి శారీరక దారుఢ్యం సొంతమవుతుంది. నీటిలో ఆత్మరక్షణ కోసం స్విమ్మింగ్ నేర్చుకుంటే బాగుంటుంది. స్విమ్మింగ్ నేర్చుకోవాలనుకునే చిన్నారులు, యువకులు, విద్యార్థులు ఎవరైనా నేరుగా రావచ్చు. స్విమ్మింగ్ నేర్చుకునే క్రమంలో అప్రమత్తంగా ఉండాలి. జిల్లా కేంద్రంలో అందుబాటులో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. పూల్‌కు వచ్చే వారు కాస్ట్యూమ్స్ వెంట తెచ్చుకోవాలి.

రాంచందర్ రావు, డివైఎస్‌వో, సంగారెడ్డి

నేనంటే.. నేను..!

» పల్లా వర్సెస్ కొమ్మూరి » జనగామలో నిధుల రగడ

» భిన్న ప్రకటనలతో అయోమయం

» పోటాపోటీగా సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చేర్యాల, మార్చి 17: అసెంబ్లీ ఎన్నికలు ముగిసినా జనగామ నియోజకవర్గంలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మధ్య ప్రచ్ఛన్నయుద్ధం కొనసాగుతూనే ఉంది. నాడు ఓట్లకోసం పోటాపోటీ విమర్శలు చేసుకోగా, నేడు నిధుల మంజూరు విషయంలో నేనంటే.. నేనని భిన్న ప్రకటనలు చేసుకుంటూ బస్తీ మే సవాల్ అంటుండటంతో నియోజకవర్గంలో రాజకీయ వాతావరణం మరోమారు వేడెక్కింది. ఎన్నికల సమయంలో అనూహ్యంగా తెరమీదకు వచ్చిన రెండునెలల్లోనే ఎమ్మెల్యే అయిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి నియోజకవర్గంలో పాగా వేసేందుకు పలు హామీలు గుప్పించారు. ప్రధానంగా చేర్యాల రెవెన్యూ డివిజన్ ఏర్పాటు, ఇండస్ట్రియల్ క్యారిడార్‌తో పాటు జనగామ మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.25 కోట్లు, చేర్యాల మునిసిపాలిటీల అభివృద్ధికి రూ.10కోట్లు మంజూరు చేయించానని, ఎన్నికల కోడ్ అనంతరం ఆయా పనులు ప్రారంభించనున్నామని ప్రకటించారు. మరోపక్క అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కూడా పలు హామీలు ఇచ్చారు. అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా జనగామలో పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందారు. అయితే, ఎన్నికలలో ఓడిపోయినా.. అక్కడి కాంగ్రెస్ అభ్యర్థులే నియోజకవర్గ ఇన్‌చార్జిలుగా కొనసాగుతారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో జనగామలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మరింత యాక్టివ్ అయ్యారు. పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో పల్లా, కొమ్మూరి మధ్య ప్రోటోకాల్ పంచాయతీ నడుస్తున్నది. ఈ నేపథ్యంలో జనగామ మునిసిపాలిటీకి రూ.25 కోట్లు, చేర్యాల మునిసిపాలిటీకి రూ.10 కోట్లు, నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు సీడీఎఫ్ నిధులు మంజూరు చేయించానని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రకటించి సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. దీనిపై ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పందించారు. తాను ఎమ్మెల్సీగా ఉన్న సమయంలో పంపించిన ప్రతిపాదనలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఆమోదించి, నిధులు మంజూరు చేసిందని, ఎన్నికల కోడ్ వల్ల నిధులు రావడం ఆలస్యమైందని, అయితే.. ఆ నిధులు తాను తీసుకువచ్చానని కొమ్మూరి అబద్ధపు ప్రచారం చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు.


ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

పోటాపోటీగా పనులు ప్రారంభం

నియోజకవర్గానికి ఇటీవల నిధులు మంజూరుకావడంతో జనగామ డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి సీసీ రోడ్లు ఇతరత్రా పనులు స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రారంభిస్తున్నారు. మరో పక్క ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆయా పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ఇలా ఇద్దరు నేతలు పోటాపోటీగా పలును ప్రారంభిస్తుండటంతో కాంట్రాక్టర్లు అయోమయానికి గురవుతున్నారు. పనులు చేపట్టకబోతే ఏం జరుగుతుందోనని, ఒకవేళ చేసినా బిల్లులు వస్తాయా, లేదా అని ఆందోళన చెందుతున్నారు.

అకాల వర్షం.. మామిడి రైతులకు నష్టం

నిజాంపేట, మార్చి 17: అకాల వర్షం మామిడి రైతును దెబ్బతీసింది. శనివారం రాత్రి కురిసిన గాలివానతో మరికొద్ది రోజుల్లో చేతికి వస్తుందనుకున్న మామిడి తోటలో కాయలు రాలి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షానికి నిజాంపేట మండలంలోని పలుచోట్ల మామిడి తోటల్లో కాయలు కింద రాలిపోయాయి.


మామిడి తోటలో రాలిన కాయలు

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

కంగ్టి, మార్చి 17: సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలంలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి పిడుగుపడి ఒకరు మృత్యువాత పడ్డారు. మండలంలోని భీంరా గ్రామంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన కురుమ సిరుగొండ(50) ఆదివారం మధ్యాహ్నం గ్రామ శివారులో చింత చెట్టుకు కాయ రాల్చేందుకు కూలీలతో కలిసి వెళ్లాడు. సాయంత్రం గాలి వానకు తోడు ఉరుములు మెరుపులు రావడంతో సిరుగొండ చెట్టుకింద నిలబడి ఉండగా, ఒక్కసారిగా పిడుగు పడడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

నాలుగు దశాబ్దాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం

» వెయ్యి మందితో సందడిగా పాఠశాల ప్రాంగణం


చారిటబుల్ ట్రస్ట్ లోగోను ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

తూప్రాన్, మార్చి 17: తూప్రాన్ పట్టణంలోని చిల్డ్రన్ హైస్కూల్‌కు చెందిన నాలుగు దశాబ్దాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం కనుల పండువగా జరిగింది. పట్టణంలో 1983లో ఏర్పాటైన చిల్డ్రన్స్ హైస్కూల్‌లో 1983 నుంచి 2024 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు సుమారు వెయ్యి మంది ఈ సమ్మేళనానికి హాజరయ్యారు. ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ శ్రీపాదరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిల్డ్రన్స్ హైస్కూల్ చారిటబుల్ ట్రస్టును ఏర్పాటు చేశారు. ట్రస్టుతో పేద విద్యార్థులకు సహాయం చేయడం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి చేయూతనివ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు ట్రస్ట్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమ చిన్ననాటి స్నేహితులను కలుసుకుని సందడి చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ వరప్రసాదం, తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై దాడి.. మద్యం స్వాధీనం

తూప్రాన్, మార్చి 17: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో పోలీసులు బెల్ట్‌షాపులపై దాడులు ప్రారంభించారు. తూప్రాన్ మండలం యావాపూర్‌లో మద్యం బెల్టు షాపులపై ఆదివారం పోలీసులు దాడులు చేసి, మద్యం నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. యావాపూర్ గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డి, నాగరాజులు బెల్టుషాపు ఏర్పాటు చేసిన మద్యం విక్రయిస్తుండగా, దాడి చేశారు. ఈ దాడుల్లో రూ. 20,170ల విలువైన 43 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని, వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం పేర్కొన్నారు.


యావాపూర్‌లో పట్టుబడిన మద్యం

బైక్‌లు ఢీకొని ఒకరు మృతి, ఇద్దరికి గాయాలు

మునిపల్లి, మార్చి17 : బైక్‌లు ఢీకొని ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి స్వల్ప గాయాలైన సంఘటన మండలంలోని లింగంపల్లి జాతీయ రహదారి 65పై ఆదివారం సాయంత్రం జరిగింది. ఈ సంఘటనకు సంబంధించి మునిపల్లి ఎస్ఐ సురేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుల్బార్గా జిల్లా చించోలి తాలుకా శ్రీనగర్ పెద్ద తండాకు చెందిన పరుశురాం రాథోడ్ - జ్యోతి దంపతులు జహీరాబాద్ వైపు నుంచి సంగారెడ్డి వైపు బైక్‌పై వెళ్తున్న క్రమంలో లింగంపల్లి గ్రామ శివారులోకి రాగానే వెనుక నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌పై మహ్మద్ ఎజాజ్ అనే వ్యక్తి పరశురాం రాథోడ్ నడుపుతున్న బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో జ్యోతికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదంలో పరుశరాం రాథోడ్, మహ్మద్ ఎజాజ్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. మృతురాలి భర్త పరుశరాం రాథోడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిన్న బీజేపీ.. నేడు బీఆర్ఎస్‌లోకి..


జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ సమక్షంలో బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన నాయకులు


మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీజేపీ నుంచి తిరిగి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

నాగల్‌గిద్ద , మార్చి 17: ఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో అప్పుడే రాజకీయాలు వేడెక్కాయి. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడటంతో వివిధ పార్టీల నాయకులు ఆపరేషన్ ఆకర్ష్‌కు తెరలేపుతున్నారు. బీఆర్ఎస్‌కు చెందిన నాగల్‌గిద్ద మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నందుపటేల్, కారముంగి మాజీసర్పంచు రవికుమార్ తమ అనుచరులతో కలిసి శనివారం సాయంత్రం జహీరాబాద్ ఎంపీ, పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి బీబీపాటిల్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఎంపీ బీబీ పాటిల్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అయితే ఒక్క రోజు కూడా గడవక ముందే వారు సొంతగూటికి చేరుకున్నారు. ఆదివారం ఖేడ్ మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి చేర్చుకున్నారు.

బీఆర్ఎస్‌కు నాగపురి రాజీనామా

» ఇటీవల జనగామ టికెట్ కోసం ముమ్మర ప్రయత్నాలు

» తమకు గుర్తింపు ఇవ్వడం లేదని అధిష్టానంపై అసంతృప్తి

» ఎన్నికలకుముందు కాంగ్రెస్‌లో చేరిన తండ్రి రాజలింగం



చేర్యాల, మార్చి 17: మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం తనయుడు నాగపురి కిరణ్‌కుమార్ సొంతగూటికి చేరనున్నారు. ఈమేరకు ఆయన బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ఆదివారం ప్రకటిస్తూ పార్టీ అధినేత కేసీఆర్‌కు లేఖ పంపించారు. ఆయన తండ్రి రాజలింగం కాంగ్రెస్ ఎమ్మెల్సీగా కొనసాగుతున్న సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కొనసాగిన నాగపురి కిరణ్ కుమార్ 2014లో బీఆర్ఎస్‌లో చేరారు. రాజలింగంకు మరో మారు ఎమ్మెల్సీ ఇస్తామని అధిష్టానం హామీ ఇచ్చినా నెరవేర్చకపోవడంతో భవిష్యత్ ఆశలతో కొనసాగారు. ఇదే క్రమంలో నాగపురి కిరణ్‌కుమార్ పలు కార్యక్రమాలు చేపట్టారు. గత అసెంబ్లీ ఎన్నికలో బీఆర్ఎస్ జనగామ టికెట్ కోసం ప్రయత్నం చేశారు. పార్టీ అవకాశం కల్పించకపోవడంతో ఎన్నికల ముందే నాగపురి రాజలింగం పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్‌లో చేరి, కొమ్మూరి ప్రతాప్ రెడ్డికి మద్దతు పలికారు. దీంతో మేల్కొన్న బీఆర్ఎస్ రాజలింగం తనయుడు నాగపురి కిరణ్‌కుమార్‌ను బుజ్జగించి, పార్టీ వీడకుండా చూసింది. ప్రస్తుతం మారిన రాజకీయ పరిస్థితులు, బీఆర్ఎస్ పట్టించుకోకపోవడంతో ఆయన పార్టీకి రాజీనామా చేశారు. తన అనుయాయులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌తీర్థం పుచ్చుకునేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నారు.

వ్యర్థాల 'వరద'..!

» పారిశ్రామిక వాడల్లో రసాయన ప్రవాహం

» మండువేసవిలో కాలువలై..

» వందల పరిశ్రమలున్నా.. అందుబాటులోని శుద్ధి కేంద్రం

జిన్నారం, మార్చి 17: మండు వేసవిలో నీటి చుక్క దొరకకపోయినా.. మండలంలోని పారిశ్రామికవాడలో రసాయిన వ్యర్థాలు మాత్రం జోరుగా ప్రవహిస్తున్నాయి. ఎండలు దంచి కొడుతుండగా నీటి ప్రవాహాలు మాత్రం దిగువన ఉన్న జలాశయాల్లోకి, దిగువ ప్రాంతాల్లోకి జీవనదుల్లా ప్రవహిస్తున్నాయి. కొన్ని పరిశ్రమల నిర్లక్ష్యం.. వందల పరిశ్రమలున్నా ఒక్క శుద్ధి కేంద్రం(ఈటీపీ) లేకపోవటంతో జిన్నారం మండల పారిశ్రామిక ప్రాంతాలలో కాలుష్య జలప్రవాహం సాగుతూనే ఉన్నది.


గడ్డపోతారంలో పీసీబీ ఏర్పాటు చేసిన సంప్‌లో చేరిన వ్యర్థ జలం

జిన్నారం మండలం బొల్లారం, కాజీపల్లి, గడ్డపోతారం ప్రాంతాల పలు పరిశ్రమల వ్యర్థ రసాయనాలు దిగువ ప్రాంతాలకు స్వేచ్ఛగా వదిలేస్తున్నారు. ముఖ్యంగా బొల్లారం పరిధిలోని ఆసానికుంట పై భాగంలో పలు రసాయన పరిశ్రమల నుంచి రసాయన జలాలను వదులుతున్నారు. ఆ కలుషిత నీరంతా సమీపంలోని ఆసాని కుంటలో చేరి.. దిగువన ఉన్న ప్రాంతాలకు వ్యాపిస్తున్నాయి. గడ్డపోతారం జిల్లెల వాగు పై భాగంలోని కొన్ని పరిశ్రమల నుంచీ కాలుష్య జలాలను వదులుతుండటంతో అవి పీసీబీ ఏర్పాటు చేసిన సంప్‌లోకి చేరుతున్నాయి. ఇక్కడ నిత్యం రెండు ట్యాంకర్ల వరకు వ్యర్థ జలాలను సేకరించి పటాన్‌చెరు శుద్ధి కేంద్రాలకు పంపుతున్నారు.


బొల్లారం పారిశ్రామిక వాడలో వేసవిలోనూ పారుతున్న రసాయన వ్యర్థాలు

శుద్ధి కేంద్రం లేక..

జిన్నారం మండలం పారిశ్రామిక ప్రాంతంగా నాలుగు దశాబ్దాల క్రితం గుర్తింపు పొందింది. అంతేకాకుండా ఇక్కడ అత్యధికంగా రసాయిన పరిశ్రమలే ఉన్నాయి. అందులో నుంచి భారీగా రసాయన వ్యర్థాలు బయటికి విడుదల చేస్తుండటంతో పరిసరాలు కాలుష్య కాసారాలుగా మారుతున్న విషయం అధికారులకు, ప్రజాప్రతినిధులకు తెలిసిందే. అయినా, ఈ ప్రాంతంలో ఒక్క శుద్ధి కేంద్రం (ఈటీపీ) కూడా లేకపోవటం గమనార్హం. సుమారు 350 పరిశ్రమలకు గానూ 250 వరకు రసాయన ఉత్పాదనలు చేసే పరిశ్రమలు ఇక్కడ ఉన్నాయి. నిత్యం వందల ట్యాంకర్ల జల, ఘన వ్యర్థాలు వెలువడుతుండగా స్థానికంగా శుద్ధి కేంద్రం లేక జేఈటీఎల్ జీడిమెట్ల, పీఈటీఎల్ పటాన్‌చెరు ప్రాంతాలకు వీటిని తరలించాల్సి ఉంటుంది. ఘన వ్యర్థాలను దుండిగల్ రాంకీ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌కు తరలించి శుద్ధి చేస్తున్నారు. కాగా పారిశ్రామిక వాడలకు ఆయా శుద్ధి కేంద్రాలు దూరంగా ఉండటంతో అంతదూరం వ్యర్థ జలాలను తరలించడం ఖర్చుతో కూడిన వ్యవహారంగా భావిస్తున్నారు. దీంతో కొన్ని పరిశ్రమల వారు ట్యాంకర్లలో వ్యర్థాలను తరలించి, బహిరంగ ప్రదేశాలు, జలాశయాలు, అటవీ ప్రాంతంలో డంప్ చేస్తున్నారు. తాజాగా, ఈ నెల 14న రాత్రివేళ గడ్డపోతారం పారిశ్రామిక వాడ నుంచి ట్యాంకర్‌లో కాలుష్య జలాలు తరలించి, మేడ్చల్ జిల్లాలో డంప్ చేస్తుండగా, పీసీబీ అధికారులు పట్టుకున్నారు. మండలంలో శుద్ధి కేంద్రం ఏర్పాటు చేస్తే ఈ సమస్యను చాలా వరకు నివారించవచ్చునని, మండలాన్ని కాలుష్యం బారిన కాపాడవచ్చునని స్థానికులు భావిస్తున్నారు.

కొండపాక మండలానికి సాగునీరు రాకుండా అడ్డుకుంటున్నారు

● రైతుల ఆరోపణ



కాలువలో మట్టి పోసిన దృశ్యం

కొండపాక, మార్చి 17 : కొండపాక మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు రాకుండా కొందరు అడ్డుకుంటున్నారని మండలానికి చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందించేందుకు కాలువలు నిర్మించారు. తపాస్‌పల్లి నుంచి కొండపాక మండలానికి నీరు వచ్చే తిమ్మారెడ్డిపల్లి ప్రాంతంలోని కాలువ వద్ద కొమురవెల్లి, చేర్యాల ప్రాంతానికి చెందిన వారు మట్టి కుప్పలు పోసి నీరు రాకుండా చేశారని మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నీరు ఎందుకు రావడం లేదో తెలుసుకోవడం కోసం ఆదివారం ఆ ప్రాంతానికి వెళ్లి చూసేసరికి కాలువ వద్ద నీరు రాకుండా మట్టితో నింపారని తెలిపారు.

రైతు వేదికలను పట్టించుకోరా!

● అధ్వానంగా నిర్వహణ
● కనీస సౌకర్యాలు కూడా లేని దుస్థితి
● పట్టించుకోని అధికారులు

మద్దూరు, మార్చి 17: గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు వేదికలు నిర్వాహణ లేక అధ్వానగా తయారయ్యాయి. ఒక్కో రైతు వేదికకు గత ప్రభుత్వం రూ.22 లక్షలు వెచ్చించి నిర్మాణాలను చేపట్టింది. క్లస్టర్ వారిగా మద్దూరు మండల కేంద్రంతో పాటు లద్నూరు గ్రామాల్లో, దూళిమిట్ట మండల కేంద్రంతో పాటు బైరాన్‌పల్లి, కొండాపూర్ గ్రామాల్లో రైతు వేదికలను ఏర్పాటు చేశారు. పలు గ్రామాల్లోని రైతు వేదికల్లోని ఫ్యాన్లు చోరీకి గురయ్యాయి. రైతు వేదికల్లోని మూత్రశాలలు నిర్వహణ లేక కంపుకొడుతున్నాయి. నీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన డ్రమ్ములు నేలమీదపడిపోయినా పట్టించుకున్న దాఖలాలు లేవు. లద్నూరు రైతువేదికలో గ్రామపంచాయతీ కార్యాలయం ఏర్పాటు చేశారు. దూళిమిట్టలో రైతు వేదిక అద్దాలు ధ్వంసం చేశారు. ప్రభుత్వం అందించిన కంప్యూటర్లతో పాటు ప్రింటర్లు కనిపించకుండా పోయాయి. దీంతో పాటు మినీ భూసార కిట్ల జాడ లేనేలేదు.

నిధుల మంజూరులో జాప్యం

గత ప్రభుత్వం ఒక్కో రైతు వేదిక నిర్వాహణకు నెలకు రూ.9 వేల చొప్పున అందిస్తున్నట్లు ప్రకటించి,



దూళిమిట్టలో రైతు వేదిక అద్దాలనుధ్వంసం చేసిన ఆకతాయిలు

కేవలం 5 నెలలకే అందించింది. అలా 5 నెలలకు మంజూరైన రూ. 45 వేలల్లో ప్రతీ నెల విద్యుత్ బిల్లుకు రూ.1000, తాగునీటికి రూ.500లు, స్వీపర్‌కు రూ.3 వేలు, స్టేషనరీ, జిరాక్స్ తదితరాలకు రూ.1000, శానిటరీ, ఫర్నిచర్, వ్యవసాయ సంబంధ పత్రాల కొనుగోలుకు రూ.1000 చొప్పున వినియోగించుకోవాలని ఆదేశాలు జారీచేసింది.

స్వీపర్లు లేక మూసే ఉంటున్నరైతు వేదికలు

రైతు వేదికలు నిత్యం తెరిచే ఉంచేందుకు స్వీపర్ల నియామకం చేపట్టాలని జారీ చేసిన ఆదేశాలు అమలుకు నోచుకోలేదు. దీంతో అవి ఎప్పుడూ మూసే ఉంటున్నాయి. ప్రతి ఏఈవో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో రైతు వేదికల్లో రైతులకు అందుబాటులో ఉండాలని, అనంతరం క్షేత్రస్థాయిలో సందర్శనకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా, ఎక్కడా అమలైన దాఖలాలు లేవు.

కొరవడిన పచ్చదనం

రైతు వేదికల చుట్టూ పచ్చదనం పెంచే ఉద్దేశంతో మొక్కలను నాటారు. వాటికి నీళ్లు అందించలేని పరిస్థితి నెలకొంది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అప్పుడప్పుడూ ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు.

అందరికీ చేరువయ్యేలా చూడాలి

కాంగ్రెస్ ప్రభుత్వం వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్ ద్వారా రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో నేరుగా మాట్లాడించి, అవగాహన కల్పించేందుకు తీసుకున్న నిర్ణయం మారుమూల మండల కేంద్రాలకు చేరువయ్యేలా చూడాలని మండల రైతులు కోరుతున్నారు.

బైక్ అదుపు తప్పి దంపతులకు తీవ్రగాయాలు

చిన్నకోడూరు, మార్చి 17: బైక్ అదుపుతప్పి కిందపడటంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన చిన్నకోడూరు మండలం ఇబ్రహీంగనర్ గ్రామ శివారులో ఆదివారం చోటుచేసుకున్నది. సిద్దిపేట పట్టణం రాంనగర్‌కు చెందిన చామంతుల బిక్షపతి తన భార్య రాజకళతో కలిసి ఆదివారం కోహెడ నుంచి ద్విచక్రవాహనంపై సిద్దిపేటకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఇబ్రహీంనగర్ గ్రామ శివారులో రాగానే కోతులు అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి పడిపోయింది. దీంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అశోక్, శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించి, సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన నాయకులు

సిద్దిపేట టౌన్, మార్చి17: తెలంగాణ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను, ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సిద్దిపేట జిల్లా ఓబీసీ సెల్ చైర్మన్ డాక్టర్ సూర్యవర్మ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా సూర్యవర్మ మాట్లాడుతూ.. నూతి శ్రీకాంత్‌గౌడ్‌ను నియమించడం యువత రాజకీయ ప్రోత్సాహానికి ఉదాహరణ అని అన్నారు. పార్టీ కోసం పని చేసిన ప్రతీ కార్యకర్తను అధిష్ఠానం గుర్తించి సముచిత స్థానం కల్పిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గరిపల్లి వెంకటి, బంక చిరంజీవి యాదవ్, మిద్దె ప్రసాద్, మోతే కుమార్, దిలీప్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలి

● బీజేపీ జిల్లా నాయకుడు కొడిక్యాల రాములు

ములుగు, మార్చి 17: బీజేపీ బలోపేతం కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని జిల్లా కార్యదర్శి కొడిక్యాల రాములు అన్నారు. ఆదివారం ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో మండల పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన మన్నె శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన కొడిక్యాల రాములు మాట్లాడుతూ.. రాష్ట్రంలో పార్టీని గెలిపించుకోవడం కోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, లక్ష్మణ్‌గౌడ్‌తో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చిన కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పల్లా చొరవతోనే గోదావరి జలాలు : బీఆర్‌ఎస్

చేర్యాల, మార్చి 17: జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చొరవతోనే తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాల పంపింగ్ చేపట్టారని బీఆర్‌ఎస్ నాయకులు గదరాజు చందు, జింకల పర్వతాలు, ఏర్పుల మహేశ్ అన్నారు. ఆదివారం చేర్యాలలో వారు విలేకరులతో మాట్లాడారు. చేర్యాల, మద్దూరు, దూళిమిట్ట, కొమురవెల్లి మండలాలలో పంటలు ఎండిపోతుండటంతో రైతులు పడుతున్న బాధను గుర్తించి, రైతుపక్షపాతిగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి నీటిపారుదలశాఖాధికారులతో ఇటీవల మాట్లాడారన్నారు. తద్వారానే తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలు విడుదల చేశారన్నారు.

బూత్ కమిటీల సమావేశం

మర్కుక్, మార్చి 17: నూతన మర్కుక్ మండలం బీజేపీ అధ్యక్షుడు రాంరెడ్డి సమక్షంలో మర్కుక్ మండల బూత్ కమిటీ సభ్యులు కాశిరెడ్డిపల్లి, దామరకుంట గ్రామాల నాయకులు ఆదివారం ఓ వ్యవసాయ క్షేత్రంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించడానికి సన్నద్ధం కావాలని రాంరెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు రమేశ్ గుప్తా, నాయకులు మహేశ్, రాజేందర్‌సింగ్, మహేందర్, మల్లేశం, కొమురయ్య, నర్సింలు, వెంకటేశం, రాజు, మహేశ్, గోపాల్, మల్లేశ్ పాల్గొన్నారు.

కోడ్ అమలుతో ఫ్లెక్సీలు తొలగింపు

కొండపాక, మార్చి 17: ఎన్నికల నిబంధనలు అమల్లోకి రావడంతో, మండలంలోని దుద్దెడలో గ్రామపంచాయతీ సిబ్బంది ఆదివారం గ్రామంలోని రాజీవ్ రహదారిపై పలుచోట్ల ఉన్న వివిధ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలను తొలగించారు.

నెంటూర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా నీరుడి చంద్రం

వర్గల్, మార్చి 17: మండలంలోని నెంటూర్ గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా నీరుడి చంద్రం ఎన్నికైనారు. ఆదివారం నెంటూర్ గ్రామంలో ఆ సంఘం సమావేశం జరిగింది. సంఘం అధ్యక్షుడిగా నీరుడి చంద్రం, ఉపాధ్యక్షుడిగా కిచ్చుగారి కనుకరాజు, ప్రధాన కార్యదర్శిగా జగ్గారి రమేష్, సలహాదారుడిగా సత్తయ్య, సంఘ సభ్యులుగా రాములు, మల్లేష్, యాదగిరి, శరవయ్య, కిష్టయ్య, నీరుడు ముత్యాలు నియమితులయ్యారు.

కురుమలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

సిద్దిపేట అగ్రికల్చర్, మార్చి 17: కురుమలకు ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సిద్దిపేట జిల్లా కురుమ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొలుపుల రాములు కోరారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో సిద్దిపేట జిల్లా కురుమ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

మల్క్యాపూర్‌లో 405వ వారం స్వచ్ఛభారత్

తూప్రాన్, మార్చి 17: మండలంలోని మల్క్యాపూర్ ఆదర్శ గ్రామంలో ఆదివారం 405వ వారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. మెక్ ఇన్ మల్క్యాపూర్ యూత్ ఆధ్వర్యంలో శ్రీదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో చీపుర్లతో ఊడ్చి చెత్తను తొలగించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ ఆంజనేయులుగౌడ్, నేచర్ ఐకాన్ యువత, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సిటిజన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణస్వీకారం



నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

గజ్వేల్, మార్చి 17: గజ్వేల్ పట్టణంలోని సిటిజన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారానికి ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు నాయిని యాదగిరి, కార్యవర్గాన్ని శాలువాలతో సత్కరించారు. వారితో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కార్యవర్గం సభ్యులు నల్లా రామ్మూర్తి, సత్యనారాయణ, మల్లయ్య, భూపాల్‌రెడ్డి, ఆయా పార్టీల నాయకులు నెంటూరు కుమార్, సయ్యద్ మతీన్, బంగార్‌రెడ్డి, సత్యనారాయణ, జంగం రమేశ్ గౌడ్, బాల్‌కుమార్, యాదగిరి, అజ్గర్, రాములుగౌడ్ తదితరులున్నారు.

బీరప్పకు కడువల అభిషేకం



పూజలు నిర్వహిస్తున్న కురుమ కులస్తులు

చేర్యాల, మార్చి 17 : మండలంలోని ఆకునూరు గ్రామ కురుమ కులస్తులు తమకుల దైవమైన బీరప్ప కల్యాణం నిర్వహించతలపెట్టిన నేపథ్యంలో, ఆదివారం కడువల అభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కురుమ కులస్తులు ఊరేగింపుగా తమ ఇళ్లలో నుంచి కడవలలో జలాలు తీసుకువచ్చి గంగస్నానం చేయించి, పాలు, నెయ్యితో అభిషేకం నిర్వహించారు. అనంతరం బీర్లపూజారులు ఏప్రిల్ 1వ తేదీన బీరప్ప-కామరాతి కల్యాణం నిర్వహించేందుకు ముహూర్తం ఖరారు చేశారు. 50 ఏళ్ల తర్వాత నిర్వహించనున్న వేడుక కావడంతో ఘనంగా జరుపుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని కులసంఘం పెద్దలు తెలిపారు.

విద్యార్థులకు పరీక్షప్యాడ్ల పంపిణీ

బెజ్జంకి, మార్చి 17 : మండలంలోని గాగిల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల పదోతరగతి విద్యార్థులకు బీజేవైఎం మండల అధ్యక్షుడు తూముల రమేష్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్సిల్లు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్స్‌ను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టు పదోతరగతి, విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి మంచి మార్కులు సాధించాలని కోరారు.

బెజ్జంకి ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక

బెజ్జంకి, మార్చి 17 : బెజ్జంకి ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గాన్ని జిల్లా కార్యవర్గ సభ్యులు బెజుగం సురేష్, కొమిరె సంతోష్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెస్‌క్లబ్ మండల అధ్యక్షుడిగా బూట్ల సూర్యప్రకాష్, ఉపాధ్యక్షులుగా కనగండ్ల సుధాకర్, కందుకూరి నగేష్, ప్రధాన కార్యదర్శిగా అమరాజు పరుశురాములు, సహాయ కార్యదర్శులుగా బోనగిరి శేషకుమార్, ఇరుకుళ్ల శ్రీనివాస్, కెడిక రాజశేఖర్, కొమ్ము రాజమల్లు, గౌరవ సలహాదారులుగా చీపురు శెట్టి మోహన్, కొప్పు రపు రాజిరెడ్డి, కొమిరె సంతోష్, బెజుగం సురేష్, కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.



మండలంలోని లద్నూరులోని ఉన్నత పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన 1998-99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 25 సంవత్సరాల తర్వాత ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం జరుపుకున్నారు. ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

- మద్దూరు

కంపు కొడుతున్న మండల పరిషత్ కార్యాలయం

సిద్దిపేటరూరల్, మార్చి17: సిద్దిపేట రూరల్ మండల పరిషత్ కార్యాలయంలోని మూత్రశాలల్లోకి వినియోగించుకునేందుకు ప్రజలు భయపడుతున్నారు. దీనికి కారణం మూత్రశాలల్లోకి నీటి సరఫరా లేకపోవడమే. నీటి సరఫరా కోసం అవసరమైన పైపులు బిగించినప్పటికీ, ఒకటి, రెండు చోట్ల మరమ్మతులు చేయాల్సి ఉంది. కానీ అధికారులు మాత్రం వాటిని పట్టించుకోవడం లేదు. సిద్దిపేట అర్బన్, రూరల్ మండల పరిషత్ కార్యాలయాలు ఒకే భవనంలో కొనసాగుతున్నాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో అర్బన్ కార్యాలయం, మొదటి అంతస్తులో రూరల్ మండల పరిషత్ కార్యాలయం కొనసాగుతున్నది. అయితే నీటి సౌకర్యం పుష్కలంగా ఉన్నా రూరల్ మండల పరిషత్ కార్యాలయంలోనీ మూత్రశాలల్లో పైపుల ద్వారా నీటి సరఫరా కాకపోవడంతో, బకెట్ల ద్వారా నీటిని అందుబాటులో పెడుతున్నారు. దాంతో మూత్రశాలలు వినియోగించిన వారు నీటిని వాడకపోవడం వల్ల దుర్గంధం వెదజల్లుతున్నది. ఈ విషయం కార్యాలయం అధికారులకు తెలిసినా వారు పట్టించుకోకపోవడం వారి పనితీరుకు నిదర్శనం. నీటి సరఫరా చేసే పైపులకి చిన్నచిన్న మరమ్మతులు చేయించకపోవడమే ఈ దుర్వాసనకు ప్రధాన కారణమైతే, అధికారులు మాత్రం తమ వద్ద బడ్జెట్ లేదంటూ, మరమ్మతులు చేయించడం లేదు. ఆ కార్యాలయానికి వస్తున్న ప్రజలు ముక్కు మూసుకుని నిలబడాల్సి వస్తున్నది. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులకు నేరుగా ఆదేశించిన అధికారులు మాత్రం కనీస స్పందించడం లేదు.



మూత్రశాలలో బకెట్లలో నీళ్లు పెట్టిన దృశ్యం

కాలువను తొలగించారు.. ప్రత్యామ్నాయం మరిచారు

● దోమల బెడదతో ప్రజల అవస్థలు

చేర్యాల, మార్చి 17: చేర్యాల పట్టణ ప్రజలు దోమలబెడదతో ఇబ్బందులుపడుతున్నారు. జనగామ-సిద్దిపేట జాతీయ ప్రధాన రహదారి విస్తరణ పనులలో భాగంగా కొన్నినెలల నుంచి డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగిస్తున్నారు. అందుకు గతంలోని మునిసిపాలిటీ డ్రైనేజీ కాలువను తొలగించారు. రోడ్డుమీద పడిన వరదనీటి మళ్లింపుకు తప్ప, మురుగునీటి మళ్లింపును అనుమతించడం లేదు. దీంతో డ్రైన్ అవతలివైపునే మురుగునీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా మారింది. అయినా మునిసిపాలిటీ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. నీటి మళ్లింపు పెనుసవాలుగా మారినా మునిసిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. రానున్న రోజుల్లో వర్షం కురిస్తే వరదనీరు ప్రవహించే అవకాశం కూడా లేకుండా పోయింది. డ్రైనేజీనీటి మళ్లింపు నోచుకోక దోమల బెడదతో పెనుప్రమాదం పొంచి ఉండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈవిషయమై మునిసిపల్ అధికారులు స్పందించి దోమల బెడద నివారణకు ఫాగింగ్ చేయడంతో పాటు బ్లీచింగ్ చేపట్టి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మురుగునీటి కాలువలో నిలిచిన డ్రైనేజీ నీరు

కాలువను ఆక్రమించినా పట్టించుకోరేం..

● సీపీఎం మండల కార్యదర్శి సత్తిరెడ్డి

కొమురవెల్లి, మార్చి 17 : డీటీపీసీ లేఅవుట్ పేరుతో గుగ్గిల్లకుంట మత్తడి కాలువను రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమించారని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఆరోపించారు. ఆదివారం పార్టీ నాయకులతో కలిసి మత్తడి కాల్వ భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ.. రసులాబాద్ దుర్గమ్మ గుడి క్రాసింగ్ దగ్గర గుగ్గిల్లకుంట నుంచి వచ్చే మత్తడి కాలువను రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూడ్చివేస్తున్నా, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ప్లాట్లు చేస్తున్న వెంచర్‌ను పరిశీలించకుండానే అధికారులు అనుమతులు ఇవ్వడాన్ని తప్పుపట్టారు. వెంటనే సంబంధిత అధికారులు పరిశీలించి మత్తడి నీళ్ల వెళ్లే కాలువను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు లేనిపక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని అధికారులను హెచ్చరించారు కార్యక్రమంలో తెలంగాణ మత్స్య కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ తేలు ఇస్తారి, సీపీఎం మండల నాయకులు వుల్లంపల్లి సాయిలు, సున్నం యాదగిరి ఆరుట్ల రవీ, ఎండీ గోరెమియ, సంఘం నాయకులు కనకయ్య, యాదయ్య, నవీన్ పాల్గొన్నారు.



గుగ్గిల్లకుంట మత్తడి కాలువను పరిశీలిస్తున్న నాయకులు

నేటి నుంచి పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

కుకునూరుపల్లి, మార్చి 17: ముదిరాజుల కుల దేవత అయిన పెద్దమ్మతల్లి మహోత్సవాలు కుకునూరు పల్లి మండల కేంద్రంలో నేటి నుంచి మొదలుకానున్నాయి. ఆరు రోజులపాటు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు కొనసాగనున్నాయి. గణపతి పూజతో మొదలై మంగళవారం మహంకాళి, పోచమ్మతల్లి బోనాలు, శుక్రవారం పెద్దమ్మతల్లి ధ్వజస్తంభ యంత్ర, విగ్రహ ప్రాణప్రతిష్ఠ, శనివారం పెద్దమ్మ తల్లి బోనాలతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఇప్పటికే కుల పెద్దలు ఆలయ మహోత్సవ పనులను పూర్తి చేశారు. గతంలో ఉన్న పాత పెద్దమ్మ ఆలయం స్థానంలో ఇప్పుడు నూతనంగా భారీ ఆలయాన్ని నిర్మించారు.

ఇందిరమ్మ గ్రామ కమిటీ ఎన్నిక

మద్దూరు, మార్చి 17: మద్దూరు మండలంలోని లద్నూరులో ఇందిరమ్మ గ్రామ కమిటీని గ్రామశాఖ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. కమిటీలో దాసరి శ్రీనివాస్‌రెడ్డి, మల్లారపు బాబు, కర్రె రామచంద్రం, బూసనబోయిన రాజు, పులి పద్మ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు పులి కనకయ్య, కార్యదర్శి కూరెల్ల మల్లేశం, దాసరి పద్మారెడ్డి, రామడుగు బాల్‌రాజ్, జీడికంటి సురేష్, నర్సయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

హుస్నాబాద్‌రూరల్/చేర్యాల మార్చి 17 : నేటి నుంచి ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పదోతరగతి పరీక్షలు జరుగుతాయని మండల విద్యాధికారి దేశిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 2వ తేది వరకు హుస్నాబాద్‌లో జరిగే పదోతరగతి పరీక్షలకు అధికారులు సర్వం సిద్ధం చేసినట్లు చెప్పారు. పరీక్ష సమయానికి గంట ముందే విద్యార్థులు పరీక్ష కేంద్రం వద్దకు చేరుకోవాలని కోరారు. సోమవారం నుంచి జరిగే పరీక్షలకు మొత్తం 822 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్(సీఎస్)), ఒక డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌తో పాటు 47 మంది ఇన్విజిలేటర్స్ నియమించినట్లు తెలిపారు. పదోతరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చేర్యాల ఎంఈవో మొగుళ్ల నర్సింహరెడ్డి తెలిపారు. విద్యార్థులు భయాందోళన, ఒత్తిడి వీడి పరీక్షలకు సన్నద్ధం కావాలని ఆయన సూచించారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక

మద్దూరు, మార్చి 17 : మండలంలోని లద్నూరులోని ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడి ఆధ్వర్యంలో ఎన్నికైన కమిటీలో అధ్యక్షులుగా పొట్ట ఎస్తేరా, కన్వీనర్‌గా కృష్ణవేణి, సభ్యులుగా మేకల లలిత, బర్మ బాలమణి, సుంచు అనిత, వజ్జల ధనలక్ష్మి, రాగుల నవనీత, కూరెల్ల లావణ్య, జీడికంటి పద్మ, అన్నోజు పుష్పలత, దండెబోయిన శిరీష, మానెపల్లి రజిత, నంద లత, సోగాల మంజుల, మల్లారపు భాగ్య, మరాఠి బాలమణి, కూరెల్ల లక్ష్మి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీనర్సయ్య, మాజీ సర్పంచ్ జీడికంటి సుదర్శన్‌తో పాటు పలువురు ఉన్నారు.

పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటుపై హర్షం

గజ్వేల్, మార్చి 17: పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు హర్షణీయమని పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు తలకొక్కుల ప్రేమ్‌కుమార్, హనుమాండ్ల నాగరాజు అన్నారు. గజ్వేల్ పట్టణంలోని పద్మశాలి సంఘ భవనం వద్ద పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పద్మశాలి కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌కు, మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. వారితో పద్మశాలి సంఘం నాయకులు గుండు మల్లేశం, వడ్డేపల్లి రమేశ్, గుండు చంద్రశేఖర్, బొల్లి సదానందం, సబ్బని చంద్రమౌళి, ఎడెల్లి మహేందర్, మెరుగు శ్రీనివాస్, పెండెం వెంకటేశ్, దావత్ సతీష్, పెండెం కృష్ణ, ధార సంతోష్, హనుమాన్‌దాస్, షేర్ల నర్సింలు, సూర లింగం, గుండు లక్ష్మణ్, గాడిపల్లి శ్రీనివాస్, గాడిపల్లి అనూప్, బలరాం, దేవులపల్లి రాజారాం, మాదాసు జగదేశ్ ఉన్నారు.



పద్మశాలి సంఘ భవనం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కార్పొరేషన్ ఏర్పాటును స్వాగతిస్తున్నాం

దౌల్తాబాద్, మార్చి17: మాదిగ, మాదిగ ఉపకులా కార్పొరేషన్ ఏర్పాటుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపడం స్వాగతిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యాక్షుడు జంగపల్లి సాయిలు అన్నారు. ఆదివారం మండల ఎమార్పీఎస్ కమిటీ నాయకులు దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్‌లో విలేకర్ల సమావేశంలో నిర్వహించారు. కార్పొరేషన్ ఏర్పాటు వల్ల ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేందర్, ఉపాధ్యాక్షుడు సూరంపల్లి కుమార్, సలహాదారులు పూర్ణయ్య, సంచు వెంకటేష్, స్వామి పాల్గొన్నారు.



దౌల్తాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న ఎమ్మార్పీ ఎస్ నాయకులు

గ్రామీణ ప్రాంత పేదలకు ఉచిత వైద్యశిబిరాలు ఎంతో దోహదం

● తొగుట సీఐ లతీఫ్



సీఐని సన్మానిస్తున్న వైద్యులు

తొగుట, మార్చి 17: గ్రామీణ ప్రాంతాల్లోని పేదల కోసం ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడం గొప్ప విషమని తొగుట సీఐ లతీఫ్ కొనియాడారు. ఆదివారం తొగుట మండలం వెంకట్రావ్‌పేటలో విశ్వహాస్పిటల్ సిద్దిపేట వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మిత్ర బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొని ఆయన రక్తదానం చేశారు. పేదలకు సేవచేయడానికి మారుమూల ప్రాంతాల్లోకి వైద్యులు రావడం అభినందనీయమన్నారు. ఈ వైద్యశిబిరంలో జప్తిలింగారెడ్డిపల్లి, లింగాపూర్, ఎల్. బంజర్‌పల్లి, రాంపూర్, చందాపూర్, మంతూర్ గ్రామాలకు చెందిన సుమారు 800 మందికి వైద్యబృందం సభ్యులు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు మహేశ్‌కుమార్, కమల్‌కుమార్, వినయ్, అభిషేక్, అలేఖ్య, ప్రసన్న, రాజ్‌కుమార్, మమతారెడ్డి, రమ్యకృష్ణతో పాటు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బడుగులకు న్యాయం

● కాంగ్రెస్ పార్టీ ఫిషర్మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి

తొగుట, మార్చి 17: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే హయాంలోనే బడుగు, బలహీన వర్గాల ప్రజలకు న్యాయం జరుతుందని కాంగ్రెస్ పార్టీ ఫిషర్మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి ముదిరాజ్ అన్నారు. ఆదివారం తెలంగాణ ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్‌గా ఎన్నికైన మెట్టు సాయికుమార్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం హామీ ఇచ్చిన మాదిరిగా 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీల అమలుకు కృషి చేస్తున్నదని కొనియాడారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతీ కార్యకర్తకు ప్రభుత్వం సముచిత స్థానం కల్పిస్తూ వారికి అండగా నిలుస్తుందన్నారు.

షిర్డీలో భవాని క్లాసికల్ డాన్స్ అకాడమీ కళా ప్రదర్శన



మహారాష్ట్రలో నృత్య ప్రదర్శన చేస్తున్న దృశ్యం

సిద్దిపేట టౌన్, మార్చి 17: మహారాష్ట్రలోని షిర్డీ సాయిబాబా శతాబ్ది మండపంలో ఆదివారం నిర్వహించిన కళా వైభవంలో సిద్దిపేటకు చెందిన భవాని క్లాసికల్ డాన్స్ అకాడమీ నిర్వాహకురాలు జి.భవానివిజయ్ ఆధ్వర్యంలో శిష్య బృందం 24 మంది విద్యార్థులు కళా నృత్యాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో సునీల్ జాదే, కాశి అన్నదాన ఆర్యవైశ్య సత్రం సభ్యులు చల్ల ప్రకాష్, భూమా నాగేశ్వరరావు, జిల్లా ప్రకాష్, అల్లాడి ఈశ్వర్, సైకిల్ స్వామీజీ ఆశ్రమం పావని, నవనాథ్, సిద్దిపేట శ్రీ షిరిడి సాయిబాబా దేవస్థానం చైర్మన్ కొండ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ చెక్‌పోస్టులను ప్రారంభించిన డీఎస్పీ

నాగల్‌గిద్ద, మార్చి 17: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా తెలంగాణ కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న మండల పరిధిలోని మోర్గి, కరస్‌గుత్తి గ్రామాల సమీపంలో పోలీస్ చెక్ పోస్టు కేంద్రాలను నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాగల్‌గిద్ద ఎస్‌ఐ సిద్దిరాములు, ఏఎస్‌ఐ అంజిరెడ్డి, పోలీసు సిబ్బంది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేటలో కేంద్ర బలగాల ఫ్లాగ్‌మార్చ్



కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ వెంకటేశ్

నిజాంపేట, మార్చి 17: ప్రశాంత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించడంతో పాటు ప్రజల్లో శాంతిభద్రతల పట్ల భరోసా నింపడమే ఫ్లాగ్‌మార్చ్ ముఖ్య ఉద్దేశమని సీఐ వెంకటేశ్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంతో పాటు కల్వకుంట గ్రామంలో ఆదివారం రామాయంపేట సీఐ వెంకటేశ్ కేంద్ర బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాల్, స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.